www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 07 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-204 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## 10న తెలంగాణ కేబినేట్ భేటీ



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల పదో తేదీన ప్రగతిభవన్‌లో జరుగనున్నది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షత వహించే ఈ సమావేశంలో.. ధాన్యం కొనుగోళ్లను

3లో

## హైదరాబాద్ కేంద్రంగా సెక్స్‌రాకెట్ ముఠా

- వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి రప్పించి దందా
- పనిలో పనిగా మారకద్రావ్యాల సరఫరా
- 17 మందిని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు
- ముఠా నాయకుడు అర్నావ్ అరెస్ట్..డ్రగ్స్ స్వాధీన్
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** అంతర్జాతీయ సెక్స్ రాకెట్ ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. 17 మందిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠా ఆగడాల నుంచి 1419 మంది బాధితులకు విముక్తి కల్పించారు. 39 కేసుల్లో 17 మందిని

2లో

## అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి



ఢిల్లీలో శ్రద్ధాంజలి ఘటిచిన రాష్ట్రపతి, ప్రధాని

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** మహాపరినిర్వాన్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,ప్రధాని మోడీ తదితరులు డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళు లర్పించారు. బాబాసాహెద్ అంబేద్కర్ వర్ధంతి నేపథ్యంలో న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ లాన్స్‌లో ప్రధాని మోడీతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్ కర్, స్పీకర్ ఓం బిర్లా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.మన దేశానికి ఆయన చేసిన ఆదర్శప్రాయమైన సేవను

3లో



## హైదరాబాద్‌లో సమగ్రాభివృద్ధికి కృషి

- మూసీ నాలాల నుంచి వరద రాకుండా చర్యలు
- మూసీపై 14 కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఎల్బీనగర్‌లో పలు కార్యక్రమాలకు మంత్రి కెటిఆర్ ప్రారంభం

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. ముందు అభివృద్ధి తర్వాతే రాజకీయం అని ఆయన చెప్పారు. అయ్యప్ప కాలనీలోకి ఇకపై వరద నీరు రాదని

3లో

## తెలుగు రాష్ట్రాలలో ఒకేసారి ఐటీ దాడులు

విజయవాడలో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, వంశీ ఇళ్లల్లో సోదాలు

హైదరాబాద్‌లో వంవీరామ్ బిల్డర్స్‌లోనూ తనిఖీలు

**విజయవాడ/హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** తెలుగు రాష్ట్రాల్లో ఒకేసారి ఐటీ దాడులు నిర్వహించడం కలకలం రేపుతోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే రెండు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో వంశీరామ్ బిల్డర్స్ చైర్మన్ సుబ్బారెడ్డి బావమరిది, డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి ఇంట్లో ఉదయం నుంచే సోదాలు చేస్తున్నారు. వంశీరామ్ బిల్డర్స్ కార్యాలయం, ఇళ్లల్లో ఏకకాలంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మొత్తం రెండు రాష్ట్రాల్లో కలిపి 36 చోట్ల ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వెళ్లిన ఐటీ అధికారులు విజయవాడలో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇళ్లల్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వంశీరామ్ బిల్డర్స్‌పై తనిఖీల్లో భాగంగానే వైసీపీ నేతల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో వైసీపీ నేత దేవినేని అవినాష్‌కు




3లో

## ఎమ్మెల్యేల ఎర కేసులో ఊరట

న్యాయవాది శ్రీనివాస్‌పై కేసు కొట్టివేత

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** ఎమ్మెల్యేల ఎర కేసులో న్యాయవాది శ్రీనివాస్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో ఊరట లభించింది. శ్రీనివాసును నిందితుడిగా చేరుస్తూ మొయినాబాద్ పోలీసులు దాఖలు చేసిన మెమోను కోర్టు కొట్టివేసింది. మంగళవారం ఉదయం ఫార్మ్ హౌస్ కేసుపై ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. 23న సిట్ ధాఖలు చేసిన మెమోపై కోర్టు విచారించింది. కేసులో ల4 గా సంతోష్ జి,ఎ5గా తుషార్, ఎ6 జగ్గు స్వామి, ఎ7 శ్రీనివాస్‌లను చేర్చాలని సిట్ మెమో దాఖలు చేసింది. కాగా మెమోపై నిందితుల తరపు లాయర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మెమో ద్వారా నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చే ప్రొసీడింగ్ లేదంటూ వాదనలు వినిపించారు. ఈ క్రమంలో శ్రీనివాస్ తరపు లాయర్ వాదనతో ఏసీబీ ప్రత్యేక కోర్టు ఏకీభవిస్తూ.. సిట్ వేసిన మెమోను కొట్టివేసింది.

## నేటినుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



- సజావుగా సభ జరిగేలా సహకరించాలన్న ప్రభుత్వం
- అఖిలపక్ష భేటీలో పాల్గొన్న మంత్రులు, విపక్ష నేతలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 7వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఇప్పటికే అన్ని పార్టీలో తమ వ్యూహాలను ఖరారు చేసుకున్నాయి. అలాగే సమస్యలు ఏవైనా

## కవిత కోరుకున్నట్లుగానే విచారణకు రెడీ



11న మీ ఇంట్లోనే ఉదయం 11 గంటలకు వస్తాం

విచారణకు సిద్దంగా ఉండాలంటూ కవితకు సిబిఐ మెయిల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను ఈ నెల 11గంటలకు ఆమె నివాసంలోనే విచారిస్తామని సిబిఐ తెలియచేసింది. కవిత రాసిన లేఖరు అనుగుణంగా సీబీఐ అధికారులు ఆమెకు సమాధానం ఇచ్చారు. ఈనెల 11న ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ లోని కవిత నివాసంలో విచారించనున్నట్లు వెల్లడించారు. దీంతో 11న కవిత అందుబాటులో ఉండాలని ఈ మెయిల్ లో సమాచారం అందించారు. విచారణ కోసం ఈ నెల 11, 12, 14, 15వ తేదీల్లో తన నివాసంలో అందుబాటులో ఉంటానని.. అందులో

3లో

## కవితకు ఇంటివద్దనే విచారణలో ఆంతర్యం



అమిత్‌షాతో ఉన్న కెసిఆర్ బంధమేమిటో ● మాజీ ఎంపి పోన్నం ప్రభాకర్ ప్రశ్న

**కరీంనగర్, డిసెంబర్ 6 (సమ సమాజం):** లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత తనకు వీలున్నప్పుడే సీబీఐ అధికారులు ఇంటికి వచ్చి విచారణ చేయాలని

3లో

## తెలంగాణలో కెసిఆర్ రాజ్యాంగమే నడుస్తోంది



బతుకమ్మ ఆడుతూనే లిక్కర్ స్కామ్ చేసిన కవిత

మండిపడ్డ వైటిపి అధ్యక్షురాలు షర్మిల

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** తెలంగాణలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావడం లేదని వైటిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రాజ్యాంగం అమలవుతోందని మండిపడ్డారు. కే అంటే కొట్టి..సీ అంటే చంపే..ఆర్ అంటే రాజ్యాంగం

3లో

## డబుల్ ఇళ్ల కోసం లంచాల డిమాండ్

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబానికి పరామర్శ

**సిద్దిపేట, డిసెంబర్ 6 (సమ సమాజం):** టీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీ ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ధ్వజమెత్తారు. డబుల్ బెడ్రూమ్ కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ సిద్ధిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట చీలసాగరం రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ కుటుంబాన్నిగజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో పరామర్శించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల మనసు గెలవాలి కానీ డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ప్రజల్ని లంచాలు అడిగి దోచుకుంటున్నారని మండిపడ్డారు. గజ్వేల్ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధిపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## అంబేడ్కర్ రిజర్వేషన్ల వల్లనే పెత్తందారీ వ్యవస్థకు చెక్



ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నల్లగొండ, డిసెంబర్ 6 (సమ సమాజం):** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ముందుచూపుతో దళితులు, పేదవాళ్లకు రిజర్వేషన్ కల్పించడం వల్లే పెత్తందారి వ్యవస్థ పోయిందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇవాళ కొందరు నాయకులు రాజ్యాంగాన్ని మార్చాలని అంటున్నారని, కానీ.. రాజ్యాంగాన్ని ఇంకా పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.ప్రతి దళితుడు తమ సొంత ఇంట్లో ఉంటూ చదువుకున్న వారికి ఉద్యోగం కల్పించినప్పుడే అంబేద్కర్ కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. అంబేద్కర్ ఆశయాలను ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు నెరవేర్చాలన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..నార్కట్ పల్లి మండలం షాపల్లి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.




## నిరుద్యోగం, అధిక ధరలపై చర్చజరగాలి

అఖిలపక్ష సమావేశంలో విపక్షల డిమాండ్

3లో

## పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలి

దీనిపై తెలంగాణ ఎంపిలు చర్చించాలి

ప్రజా గాయకుడు గద్దర్ సూచన



3లో

## సంపాదకీయం

### ప్రజల సమస్యలపై పార్లమెంట్ చర్చించాలి !

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి అర్పిస్తున్న నేతలు.. ఆయన స్ఫూర్తిని మాత్రం కొనసాగించడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందు రోజే యాదృచ్ఛికంగా వర్ధంతిని జరుపుకుని నివాళి అర్పించిన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు పార్లమెంటులో చిత్తశుద్ధితో పనిచేయాలి. సమస్యలను పరిష్కరించకున్నా ఫర్వా లేదు. కానీ వాటిపై చర్చకు ఆస్కారం ఇవ్వాలి. దేశంలో ఉన్న సమస్యలు కనీసం ప్రజలకైనా తెలియాలి. ప్రజలు ఏయే సమస్యలు ఎలా ఎదుర్కొంటున్నారో పార్లమెంటులో చర్చ ద్వారా దేశ ప్రజలు గుర్తించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ జరగనన్ని నేరాలు, ఘోరాల సంఘటనలు దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అనేకం జరుగుతన్నాయి. వీటిపై కఠినచర్యలు తీసుకోక పోవడంపై దోషుల్లో మార్పు కానరావడం లేదు. పార్లమెంట్ అంటే మోడీ లేదా విపక్ష పార్టీలకో సంధించిన వ్యవహారం కాదు. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటోంది. వాటిపైన చర్చచేయాలి. ఎవరు బాధ్యులో ఎవరు బాధ్యులు కాదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఐటి,ఇడి దాడుల పైనా చర్చించాలి. అక్రమా లను నిలదీయాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. ప్రధాని మోడీ చెప్పిన లెక్కలపై కెసిఆర్ సర్కార్ కసరత్తు చేసి,నిజాలు బయట పెట్టాలి. అలాగే నిధుల విషయం లో నిక్కచ్చిగా ఉండాలి. కేంద్ర పథకాల నుంచి వచ్చిన డబ్బుల పైనా జవాబుదారీ తనం చూపాలి. కేంద్రం ఏయే పథకాల కిద ఎంతెంత డబ్బులు ఇచ్చాయో సిఎంలు ప్రకటించాలి. నిధులపై చర్చ చేయాలి. ఆ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం జరిగితే వాటిపైనా చర్చించాలి. ప్రజలను మోసం చేస్తూ ఎంతకాలం ఇలా పరస్పర విమర్శలు చేసుకోవడం తగదు. ఇకపోతే విభజన సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలన్న సంకల్పం ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కనిపించడం లేదు. నిజానికి చట్టబద్ధంగా రావాల్సిన అనేక అంశాల విషయంలో కలసి పోరాడాలన్న సన్నద్ధతను తెలుగు రాష్ట్రాల సిఎంలు ప్రకటించడం లేదు. కేంద్రం కూడా ఇరు రాష్ట్రాలపై బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తోంది. అలాగే ఎపి ప్రభుత్వం కేంద్రాన్ని పల్లెత్తు మాట కూడా అనడం లేదు. ఇక తెలంగాణ సిఎం కెసిఆర్ కేంద్రం పై యుద్దం ప్రకటించినా లాభం లేకుండా పోతున్నది. విభజన అంశాలపై సిఎం జగన్‌తో కలసి గట్టిగా పోరాడాలన్న చొరవ చూపడం లేదు. పార్లమెంట్ సమావేశాలు జరుగబోతున్న క్రమంలో ఇరు రాష్ట్రాల సిఎంలు సమస్యలపై ఉమ్మడి అవగాహన కు రావాలి. ఎంపిలు కూడా చట్టసభల్లో ప్రభుత్వాన్ని కలసికట్టుగా నిలదీసేలా కార్యాచరణ సిద్దం చేసుకో వాలి. ముందుగా విభజన సమస్యలను గుర్తించి వాటిని పార్లమెంట్ ఉభయసభ్లో నిలదీయాలి. కేంద్రం సమస్యలను పరిష్కరించడం లేదన్న విషయాన్ని దేశం దృష్టికి తీసుకుని రావాలి. సమస్యలను గట్టిగా నిలదీయలేక పోవడంతో కేంద్రం కూడా ఉదాసీనంగా ఉంటోంది. రాష్ట్రాలను ఉద్దరించామన్న ధోరణిలో ఉంది. ఈ క్రమంలో కేంద్రం చూసీచూడ నట్టుగా వ్యవహరిస్తోంది. అంతేకాకుండా చట్టబద్దంగా రావాల్సిన నిధులను కూడా ఉదారంగా ఇచ్చినట్లుగా ప్రకటించుకుంటోంది. ఇలాంటి చర్యల వల్లనే కేంద్రాన్ని నిలదీయ లేక పోతున్నారు. కెసిఆర్ సర్కార్ అంతో ఇంతో కేంద్రాన్ని నిలదీస్తున్నా జగన్ మాత్రం అస్సలు నిలదీయ డం లేదు. ముఖ్యంగా జగన్ సర్కార్ స్నేహపూర్వక వాతావరణంలో అయినా కేంద్రంతో పోరాడాలి. అలాగే ఆర్థికరంగం దివాళా తీస్తున్నా నగదు బదిలీ పథకాలను ఎంతమాత్రం కొనసాగించడం సరికాదు. ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, ఏపీ ఆర్థిక లోటు భర్తీ గురించి జగన్మోహన్ రెడ్డి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఆంధ్రుల హక్కుగా నిర్మాణం జరిగిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేతకు కూడా జగన్ ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయలేకపోతోంది. విశాఖ ఉక్కు కార్మికులకు భరోసా

ఇవ్వలేక పోతోంది. ఫలితంగా కార్మికులు ఆందోళన మార్గం వీడడంలేదు. విశాఖ ఉద్యమాన్ని రాజకీయ కోణంలో ఆడుకోవడం తప్ప కార్మికుల డిమాండ్లకు పరిష్కారం చూపే సత్తా కూడా కానరావడం లేదు. ఇకపోతే దేశంలో అనేక అవకతవకలు సాగుతున్నాయి. ప్రజలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలను కోల్పోతు న్నారు. ఉపాధి కోసం విదేశాల బాట పట్టారు. నిత్యం నరక అనుభవిస్తున్నా సమస్యలపై మోడీ చిత్తశుద్ధి ప్రకటించడం లేదు. మోడీ సొంత ఎజెండాతో పోతున్నారే తప్ప దేశం ఎజెండాను భుజాన వేసుకోవడం లేదు. ఎన్నికల్లో గెలవడం ఎలా అన్నదే ప్రధాన లక్ష్యంగా మారింది.ఈ పద్దతి పోవాలి. ఎల్ఐసి, విశాఖ ఉక్కుల ప్రైవేటీకరణలపైనా చర్చించాలి. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించే అవకావం విపక్షాలకు ఇవ్వాలి. పార్లమెంటు ప్రజల కోసం అన్న విషయం మరవరాదు. అధికారంలో ఉన్నంమన్న ధీమాలో తమకు సంబంధించిన వ్యవహారంగా చూడరాదు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ధరల పెరుగుదల అందనంతగా ఉంది. విద్యుత్, సాగునీటి రంగాలు దుర్భరంగా ఉన్నాయి. వ్యవసాయ రంగం కుదేలవుతోంది. అలాగేపంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. వీటిని అధిగమించేందుకు తీసుకునే నిర్ణయాలపై పార్లమెంటులో చర్చించాలి. అప్పుడే సమగ్రమైన చర్చ ద్వారా సమస్యకు పరిష్కారం దక్కగలదు. ఈ సమస్యలపై ఈ సమావేశాల్లో ఏ మేరకు చర్చ చేస్తారన్నది ప్రజలు కూడా గమనించాలి. పాలకుల తీరును గమనించి అప్రమత్తంగా ఉండకుంటే మనకే మోసం అని గుర్తించాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## అభ్యర్థులు సెల్‌ఫోన్లకు దూరం కావాలి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచన



**వరంగల్, డిసెంబర్ 6 (సమ సమాజం):** ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్న తరుణంలో ప్రతి అభ్యర్థి సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌ను మంత్రి దయాకర్ రావు ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ఎన్ఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కేటీఆర్ ఆదేశాల మేరకు వాళ్ల నాన్న పేరు మీద ట్రస్ట్ పెట్టి ఈ పని చేస్తున్నందుకు అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించిందన్నారు. ప్రయివేటు రంగంలోనూ 17 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు గుర్తు చేశారు. కోచింగ్ తీసుకుంటున్న మీరంతా.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఆ భగవంతుడిని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండి, పట్టుదలతో చదివి ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని చెప్పారు. మీకు ఉద్యోగం వస్తే మీ తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తారని పేర్కొన్నారు. అయితే పరీక్ష రాసిన వారంతా సెలెక్ట్ కాకపోవచ్చు.. కానీ ఈ నాలెడ్జ్ ఎక్కడో ఒక చోట ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని పక్షంలో ప్రయివేటు రంగంలో ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని దయాకర్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ వాణీ దేవి, స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్, కార్పొరేటర్లు దిడ్డి కుమార స్వామి, గుండెటి నరేందర్, మసూద్, రమేష్ బాబు, సురేష్ జోషి, మస్కుమల్ల అరుణ, కావేటి కవిత, పోషాల పద్మ, వెల్పుకొండ సువర్ణ, చింతాకుల అనిల్, వోని భాస్కర్, వోని స్వర్ణ లత, వస్కుల బాబు, మరుపల్లి రావు, బైరబోయిన దామోదర్, సోమిషెట్టి ప్రవీణ్, ప్రొఫెసర్ జయశంకర్ కోచింగ్ సెంటర్ సత్యనారాయణ చారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దళితుడనైనా బాగానే చదువుకున్నా

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



**కరీంనగర్, డిసెంబర్ 6 (సమ సమాజం):** సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకంటే తాను ఎక్కువే చదువుకున్నానని మానకొండూరు టీఆర్ఎస్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తనకు వచ్చిన అవకాశాలను సద్వినయోగం చేసుకోవడం వల్లనే ఇది సాధ్యమయ్యిందని అన్నారు. శంకరపట్నం మండలం కన్నాపూర్ లో జరిగిన అంబేద్కర్ వర్ధంతి సభలో పాల్గొన్న రసమయి బాలకిషన్.. తాను కూడా అంబేద్కర్ మాదిరిగానే చదువుకుని డాక్టరేట్, గోల్డ్ మెడల్ సాధించానని చెప్పారు. పేద దళిత కుటుంబంలో పుట్టిన తాను.. ఉన్నత చదువులు చదువుకుని డాక్టర్ రసమయి బాలకిషన్ గా మీ ముందు నిల్చున్నానని చెప్పారు. తాను టీచర్ గానూ పని చేశానని, గోచి, గొంగడి పెట్టుకుని పాటలు పాడానని రసమయి తెలిపారు. మరోవైపు.. కరీంనగర్ జిల్లాలోని గద్దపాక గ్రామంలో రేషన్ షాప్ ప్రారంభోత్సవానికి వెళ్లిన రసమయి బాలకిషన్ ను అఖిలపక్షం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేను కలవనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తే అడ్డుకుంటారా..? అంటూ అఖిలపక్షం నాయకులు మండిపడ్డారు. రసమయి బాలకిషన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## బహుజనులకు స్వేచ్ఛా, సమానత్వం కల్పించిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్

ఆనగంటి కృష్ణ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం



**మునుగోడు, డిసెంబర్ 6 (సమ సమాజం):** మునుగోడు మండలం పలివెల గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్67 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆ నగంటి కృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పీడిత వర్గాల ప్రక్షాళ పోరాడి వారి హక్కులు సాధించిన మహెూన్నతుడు అంబేద్కర్ గారు దేశంలో బహుజనులు హక్కులు పొందుతున్నారంటే అది మహనీయుని వలనేఅని అన్నారు అజ్ఞాన కాలంలో విజ్ఞానంతో యుద్ధం చేసి సకల జనులను స్వేచ్ఛగా సమానత్వమని కల్పించిన అంబేద్కర్ గారి ఆలోచన సిద్ధాంతాలను పునికి పుచ్చుకొని యావత్ భారత దేశ ప్రజలు ముందు కొనసాగాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మార్తమోహన్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ జాల వెంక రెడ్డి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోసు కొండ చిరంజీవి నాయకులుగోసుకొండ స్వామి గోసుకొండ నరేష్ ఆనగంటి శంకర్ గుత్తినరసింహ గుత్తి మారయ్య గోసుకొండ కిరణ్ బైండ్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు

## మంత్రి కెటిఆర్ డ్రగ్స్‌కు బానిస

బ్లడ్ శాంపిల్స్ ఇస్తే నిరూపిస్తా

బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపణలు



**నిర్మల్, డిసెంబర్ 6 (సమ సమాజం):** మంత్రి కేటీఆర్ డ్రగ్స్‌కు బానిస అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. బ్లడ్ శాంపిల్స్ ఇస్తే నిరూపిస్తానని, నమూనాలు ఇచ్చే దమ్ము కేటీఆర్ కు ఉందా.. అంటూ సవాల్ విసిరారు. హైదరాబాద్, బెంగళూరు డ్రగ్స్ కేసులను రీఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా దిమ్మదుర్తిలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి సభలో బండి సంజయ్ పాల్గొన్నారు. జీ20 సమావేశానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లకపోవడం సిగ్గుచేటన్నారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను కాపాడేందుకు సీఎం కేసీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. అవినీతిలో తండ్రికి తగ్గ కూతురుగా కవిత గుర్తింపు పొందారంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగాన్ని తీసుకురావాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ అంబేద్కర్ స్ఫూర్తితో దేశాన్ని శక్తివంతంగా మారుస్తున్నారని బండి సంజయ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వారం రోజుల పాటు అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తాను ఎంపీ అయ్యానని చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాకే పేదోళ్లకు న్యాయం జరుగుతోందని, 12 మంది ఎస్సీ ఎంపీలను కేంద్రమంత్రులు చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్నే మారుస్తాననడం కేసీఆర్ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు.

## నూతన జిల్లాల ఏర్పాటుతో పెరిగిన ఉపాధి అవకాశాలు



వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

**వనపర్తి, డిసెంబర్ 6 (సమ సమాజం):** నూతన జిల్లాల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో రూ.2.10 కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారికి, నాగవరం తండా సమీపంలో రూ.25 లక్షలతో 29 గుంటలలో నిర్మించబోయే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం భౌగోళికంగా నలువైపులా వేగంగా విస్తరిస్తుందని వివిధ రకాల ద్విచక్ర వాహనాలు, కార్ల షోరూంలు, మార్కెట్లు, మాల్స్ ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు.దానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఏడాదిన్నరలోపు వనపర్తి సమీపంలో ఆహారశుద్ధి పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. సీఎం కేసీఆర్ అద్భుతమైన ఆలయం నిర్మించారని, స్థానికంగా ఆలయాల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. ఈ నెల 12 తర్వాత వనపర్తిలోని ప్రతి రోజూ రెండు వార్డుల చొప్పున పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని వివరించారు.అంతర్గత రహదారులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు. అంతకు ముందు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు.

## దేశవ్యాప్తంగా దళితబంధు అమలు చేయాలి

ప్రధాని మోడీని కోరిన పిడమర్తి రవి



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** అట్టడుగు వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన దేశ అభివృద్ధి జరిగినట్లు అని భావించి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ స్ఫూర్తిని, దళిత, బహుజన ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ నింగికి ఎగరేసారని తెలిపారు. దేశంలోని దళితుల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా దళితబంధు పథకాన్ని అమలు చేయాలని ప్రధాని మోదీని రవి డిమాండ్ చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతిని పురస్కరించుకొని ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి పిడమర్తి రవి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ పాలన సాగుతుందన్నారు. అదే విధంగా తెలంగాణ నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరును సీఎం కేసీఆర్ నామకరణం చేసి నిజమైన నివాళులర్పించారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ స్వరాష్ట్రం అయినా గుజరాత్‌లో దళితులతో పాటు అన్ని వర్గాలలోని పేదలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేదరికం నెలకొందన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలను ఆదుకుంటూ, పేదరికాన్ని రూపుమాపుతున్నారని రవి స్పష్టం చేశారు. అన్ని వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు పిడమర్తి రవి.



నివాళి సభలో మంత్రిజగదీశ్వర్ రెడ్డి

## అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి

**నల్గొండ, డిసెంబర్ 6 (సమ సమాజం):** భారత దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని మంత్రి జగదీష్ రెడ్డి కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంత్రి నివాళు లర్పించారు. అనంతరం జగదీష్ రెడ్డి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల ఐక్యత, హక్కులకు నిదర్శనం అంబేద్కర్ రాజ్యాంగం అని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తి, ఆలోచన, ఆశయాలను అమలు చేస్తున్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రజలంతా ఆర్థికంగా, సామాజిక పరంగా సమానత్వం సాధించడమే అంబేద్కర్ లక్ష్యం అని చెప్పుకొచ్చారు. విద్యను అన్ని వర్గాల ప్రజలకు అందించడం అంబేద్కర్ ఆశయం అని స్పష్టం చేశారు. అందరూ అంబేద్కర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని.. అద్భుత సమాజ నిర్మాణం కోసం పాటు పడాలని మంత్రి పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ కేంద్రంగా సెక్స్‌రాకెట్ ముఠా

(మొదట పేజీ తరువాయి) పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో కీలకంగా ఉన్న ముఠా నాయకుడు అర్నావ్‌ను అరెస్ట్ చేశారు. ఎపి, తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ, ముంబయితో పాటు బంగ్లాదేశ్, నేపాల్, థాయ్‌లాండ్, రష్యా దేశాలకు చెందిన బాధితులకు విముక్తి కల్పించారు. ఈ ముఠా పలు వెబ్‌సైట్లలో ఎస్కార్ట్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తుంది. ఈ ముఠా ఉపాధి పేరుతో తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుంది. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ భారీ సెక్స్ రాకెట్‌ను ఛేదించిందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 17 మందితో కూడిన సెక్స్ రాకెట్ ముఠాను అరెస్ట్ చేశామన్నారు. 15 సిటీల నుండి యువతులను రప్పించి సెక్స్ రాకెట్స్ నడుపుతున్నారని వెల్లడించారు. వెబ్ సైట్, వాట్సాప్ గ్రూప్స్, కాల్ సెంటర్లు, యాడ్స్ ద్వారా కస్టమర్లను ఆకర్షించి.. అమ్మాయిలను పంపిస్తున్నారని చెప్పారు. 39 కేసుల్లో నిందితుల ప్రమేయం ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. 1419 మంది అమ్మాయిలు వ్యభిచార ముఠాలో చిక్కుకున్నట్లు గుర్తించామన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలతో పాటు విదేశీ మహిళలతో సెక్స్ రాకెట్స్ నడుపుతున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. సెక్స్ రాకెట్స్ తో పాటు డ్రగ్స్ కూడా సరఫరా చేస్తూ కస్టమర్లకు ఎర వేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే సైబరాబాద్‌లో ఐదు కేసులు నమోదు చేసి, విచారిస్తున్నామన్నారు. సరఫరాదారులు, బ్రోకర్లు ద్వారా బాధిత మహిళలను కస్టమర్లు దగ్గరకు పంపుతున్నారని చెప్పారు. విమానాల్లో కూడా అమ్మాయిలను ఇతర రాష్ట్రాల కస్టమర్ల దగ్గరకు పంపుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. వ్యభిచారం ద్వారా వచ్చిన డబ్బులో 30శాతం బాధిత యువతులకు, 35శాతం యాడ్స్, వెబ్ సైట్స్‌కు మిగతా 35 శాతం నిర్వాహకులు తీసుకుంటారని సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. ఆర్నావ్ అనే వ్యక్తి కీలక నిందితుడని చెప్పారు. 915 మంది అమ్మాయిలను ముంబై, కోల్ కత్తా నుండి తీసుకొచ్చాడని చెప్పారు. 2019 నుండి సమీర్ అనే వ్యక్తి 850 మంది అమ్మాయిలను సరఫరా చేశాడని తెలిపారు. ఏపీలోని అనంతపురం, తెలంగాణలోని కరీంనగర్ నుండి సెక్స్ రాకెట్ నడుపుతున్నారని చెప్పారు. సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ లో ఆర్నావ్ డ్రగ్స్, వ్యభిచార దందా నిర్వహిస్తున్నాడని వెల్లడించారు. 950 మంది అమ్మాయిలతో హైదరాబాద్ లో సెక్స్ రాకెట్ నడుపుతున్నాడని తెలిపారు. సోమాజిగూడలో కీలక నిందితుడు ఆర్నావ్ ను అరెస్ట్ చేశామని సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. ఆర్నావ్ ఉంటున్న ఇంట్లోనే డ్రగ్స్ ను సీజ్ చేశామన్నారు. సెక్స్ రాకెట్ ముఠా సభ్యులు వివిధ గ్రూపులుగా విడిపోయి దందా చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో కొన్ని హోటల్స్ లో పని చేసే వాళ్ల కూడా ప్రమేయం ఉందని, వారిని కూడా అరెస్ట్ చేశామన్నారు. ఉద్యోగాలు లేని అమ్మాయిలను, పేదరికంలో ఉన్న యువతులను జాబ్స్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నారని తమ విచారణలో వెల్లడైందని చెప్పారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు.

## భూ నిర్వాసితులపై ఇంత అక్కసా

అయితే కెసిఆర్ ఫామ్‌హౌజ్ 15 లక్షలకు ఎకరా కొంటాం

మంత్రి హరీష్ రావుకు బిజెపి అధికార ప్రతినిధి రాణీరుద్రమ కౌంటర్




**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** భూ నిర్వాసితుల నష్టపరిహారంపై మంత్రి హరీష్ రావుకు బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి కౌంటర్ ఇచ్చారు. పరిహారం ఇవ్వడంలో అన్యాయం చేయడమే గాకుండా అడిగిన వారిపై కేసులు పెట్టి హింసించిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. మీరు అంతగా ఎక్కువ పరిహారం ఇచ్చామని భావిస్తే రూ.15 లక్షలకు ఎకరం చొప్పున కేసీఆర్ ఫాంహౌజ్ మొత్తం కొంటాం అమ్ముతారా అని ప్రశ్నించారు. తెలంగాణలో దౌర్భాగ్య పాలన నడుస్తోందన్నారు. ఇందుకు పరిహారం చెల్లింపులే అని అన్నారు. రాష్ట్రంలో 19 వేల మంది రైతుకూలీలు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదన్నారు. కామారెడ్డిలో రైతు ఆంజనేయులు ఆత్మహత్య బాధాకరమన్న రాణి రుద్రమ..జులైలో పంటనష్టం జరిగితే ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. నేషనల్ క్రైం బ్యూరో లెక్కల ప్రకారం రాష్ట్రంలో 5900లకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వీటికి హరీష్ రావు సమాధానం చెప్పాలన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా కెసిఆర్ పాలన

రిజర్వేషన్లు కాలరాసేందుకు కేంద్రం కుట్ర: మల్లు రవి



**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ అంబేద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన చేస్తున్నారని పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కాలరాసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన ప్రజలను కుల, మత పరంగా విడదీసి చూస్తున్నారని విమర్శించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన మల్లు రవి దేశంలో మతపరమైన విభజన చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు లేకుండా చేయడం కోసం 6 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని , రాజ్యాంగాన్ని కాపాడడం కోసమే రాహుల్ గాంధీ కన్యా కుమారి నుంచి కాశ్మీర్ వరకు 3500 కిలోమీటర్లు భారత్ జోడో పాదయాత్ర చేస్తున్నారని మల్లు రవి వివరించారు. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేకుండా పాలన చేస్తున్న మోడీ, కేసీఆర్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఏకం కావాలని మల్లు రవి పిలుపునిచ్చారు.

## 10న తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదట పేజీ తరువాయి) మరింత ముమ్మరం చేయడంపై చర్చించే అవకాశం ఉన్నది. సొంత జాగలు ఉన్న బలహీన వర్గాలకు ఇండ్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం మహబూబ్‌నగర్ సభలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంతోపాటు.. రైతుబంధు నిధుల విడుదల, దళితబంధు పథకం అమలు తదితర అంశాలపైనా ఈ సమా వేశంలో చర్చించే అవకాశం ఉన్నది. శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగే క్యాబినెట్ సమావే శానికి వివిధ శాఖల మంత్రులు హాజరు కానున్నారు.

## నిరుద్యోగం, అధిక ధరలపై చర్చజరగాలి

(మొదట పేజీ తరువాయి) **న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో నిరుద్యోగ, అధిక ధరలపై ప్రధానంగా చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. రక్షణమంత్రి, లోక్ సభ ఉపనాయకుడు రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షత అఖిలపక్ష భేటీ జరిగింది. కాంగ్రెస్, టీఎంసీలు నిరుద్యోగం అంశాన్ని ప్రధానంగా లేవనెత్తాయి. అదేవిధంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై చర్చకు కాంగ్రెస్ పట్టుబట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించాలని బిజూ జనతాదళ్ కోరింది. కొలీజియం వ్యవస్థ వంటి అంశాల్లో ఎలాంటి రాజకీయాలు ఉండకూడదని ఈ అంశంపై విస్తృత చర్చ జరగాలని బీజేడీ మరో డిమాండ్ చేసింది.దేశానికి అతిపెద్ద సవాలుగా ఉన్న జనాభా నియంత్రణ బిల్లును ప్రభుత్వం తీసుకు రావాలని శివసేన డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ధరల పెరుగుదలపై ప్రత్యేకించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాల్సిన అవసరాన్ని లేవనెత్తింది. నిబంధనల ప్రకారం అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. సెషన్ తేదీలను ప్రకటించే ముందు పండుగ కాలాన్ని పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం అని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అన్ని పరిగణలోకి తీసుకున్నాకే సెషన్ తేదీలను ఖరారు చేశామని చెప్పారు. డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 29 వరకు పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశానికి ప్రభుత్వం తరపున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రులు మురళీధరన్, అర్జున్ మేఘ్వాల్, లీడర్ ఆఫ్ ది హౌస్ పీయూష్ గోయల్ హాజరయ్యారు. ప్రతిపక్షాల నుంచి అధిర్ రంజన్ చౌధరి (కాంగ్రెస్), సుదీప్ బందోపాధ్యాయ్, డెరెక్ ఓబ్రియాన్ (టీఎంసీ), తిరుచ్చి శివ, టీఆర్ బాలు (డీఎంకే), పశుపతి పరాస్ (ఎల్జేపీ), వందనా చవాన్ (ఎన్సీపీ), ఫరూఖ్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), బినోయ్ విశ్వం (సీపీఐ) తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

## హైదరాబాద్‌లో సమగ్రాభివృద్ధికి కృషి



(మొదట పేజీ తరువాయి) అన్నారు. ఎల్బీనగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్ చుట్టూ ఉండే మున్సిపాలిటీల్లో రూ.220 కోట్లతో అభివృద్ధి పనులను చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 28 రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు హైదరాబాద్‌కు వచ్చి నివాసం ఉంటున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి పనులు జరిపిస్తామని తెలిపారు. రూ.985 కోట్లతో నాలాల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇక మూసీనది పై 14 కొత్త బ్రిడ్జిలను త్వరలో కట్టబోతున్నామని కేటీఆర్ అన్నారు. రూ.84 లక్షలతో జంతువుల కోసం పెట్ ఆడిటోరియంను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఆటోనగర్‌లో ఫ్లవర్ గార్డెన్‌ను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్‌లో ఏ మూలకు పోయినా పచ్చదనం కనిపిస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.16 కోట్లతో ముక్తిఘాట్ నిర్మించామని తెలిపారు. రూ. 985 కోట్లతో నాలాల ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. ఫిర్జాదీగూడ దగ్గర రూ.52 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేశామని అన్నారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 14 బ్రిడ్జ్‌లు కట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణలో మళ్లీ వచ్చేది తెలంగాణ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరేనని మంత్రి కేటీఆర్ అన్నారు. 'నాగోల్, ఎల్‌బీ నగర్ వరకు మెట్రో పూర్తయ్యింది. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మధ్య ఐదు కిలోమీటర్ల మార్గాన్ని రెండో ఫేజ్‌లో కలిపే ప్రయత్నం చేస్తాం. రేపే చేస్తామని చేయలేదని అంటారు. అందుకే ముందుగానే చెబుతున్నా. నాకు తెలుసుకు, మీకు తెలుసు. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది సీఎం కేసీఆరే.. వచ్చేది టీఆర్ఎస్ ప్రభుత్వమే.. వచ్చే ఎన్నికల తర్వాత ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరిస్తాం. ఆ దిశగా ప్రజారవాణాను విస్తరించే ప్రయత్నం చేస్తాం. టిమ్స్ ఆసుపత్రి గడ్డి అన్నారంలో రాబోతుంది' అన్నారు.

## తెలంగాణలో కెసిఆర్ రాజ్యాంగమే నడుస్తోంది

(మొదట పేజీ తరువాయి) ఎస్సీలకు అన్యాయం జరుగుతోందని ఆమె ఆరోపించారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు అంబేద్కర్ పెడితే కేసీఆర్ తీసేశారని చెప్పారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్..మాట తప్పారన్నారు. పదిశాతం మందికి కూడా దళితబంధు పథకం ఇవ్వలేదన్నారు.రాజ్యాంగం మార్చాలని సీఎం కేసీఆర్ అంబేద్కర్?ను అవమానించారన్నారు. రాజ్యాంగం ఎందుకు మార్చాలో కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం లేదని షర్మిల అన్నారు. కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ నియంత పాలన పోయి..ప్రజల ప్రభుత్వం రావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజల కోసం కొట్లాడే ప్రజలు ఉండొద్దు అని కేసీఆర్ రాజ్యాంగంలో ఉందన్నారు. ప్రజల కోసం నిలబడే వాళ్ళని నల్లిని నలిపినట్టు నలిపేయాలని కేసీఆర్ రాజ్యాంగంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను అవమాన పర్చాలి.... పెట్రోల్ బాంబులతో దాడి చేయాలని కేసీఆర్ రాజ్యాంగంలో రాసి ఉందని ఆరోపించారు. పోలీసులను తమ సొంత పార్టీ మనుషుల్లాగా వాడుకోవాలని కేసీఆర్ రాజ్యాంగంలో రాసి ఉందన్నారు. ప్రజల కోసం సచ్చిపోవడానికి వెనుకాడని నాయకులు తెలంగాణలో రావాలన్నారు. మంత్రి హరీష్ రావు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఆయనవి బోగస్ మాటలని కొట్టిపారేశారు. ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి అగ్గిపెట్టె తెచ్చుకుని తనను తాను అగ్నికి ఆహుతి చేసుకుని తెలంగాణ కోసం అమరుడయ్యారని గుర్తు చేశారు. కానీ మంత్రి హరీష్ రావు అగ్గిపెట్టె మర్చిపోయి..మంత్రి అయ్యారని చెప్పారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోందన్నారు.రాజశేఖర్ రెడ్డి తెలంగాణ ప్రజల కోసమే ఉచిత విద్యుత్ పథకంపై సంతకం పెట్టారని చెప్పారు. కవితమ్మ అమాయకంగా బతుకమ్మ ఆడుతూనే..లిక్కర్ స్కాంకు తెరలేపిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబానికి ఆస్కార్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. తన అరెస్ట్ పట్ల సానుభూతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.




# అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి



(మొదట పేజీ తరువాయి) స్మరించుకుంటున్నానని, అంబేద్కర్ పోరాటం వల్ల లక్షలాది మందిలో ఆశ చిగురించాయని ప్రధాని ఈ సందర్భంగా ట్వీట్ చేశారు. భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించడానికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని కొనియాడారు. మనందరం సమానమని, మనందరం భారతీయులమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. వీటన్నింటికీ విరుద్ధమైన వాటిని బాబాసాహెబ్ ఆమోదించరని, ఆయన బాటలో నడిచే మనకు కూడా ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కు నివాళి అర్పిస్తూ పోస్ట్ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాళి అర్పించారు. కొంతమంది ముఖ్యమంత్రులు రాజ్యాంగం మార్చాలనే కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యాంగం పనికిరాదని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్న కిషన్ రెడ్డి.. రాజ్యాంగం అనుసరించే మోడీ పరిపాలన కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. పంచతీర్థ పేరుతో అంబేద్కర్ కు సంబందించిన స్థలాలన్నీ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ స్థలాలు సందర్శించడానికి పంచతీర్థ పేరుతో ఏప్రిల్ 14న కొత్త రైలు ప్రారంభిస్తున్నామని చెప్పారు.

## తెలుగు రాష్ట్రాలలో ఒకేసారి ఐటీ దాడులు

(మొదట పేజీ తరువాయి) చెందిన స్థలం డెవలప్‌మెంట్ కోసం వంశీరామ్ బిల్డర్స్ తీసుకుంది. ఒప్పందంలో భాగంగా జరిగిన లావాదేవీలపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నట్టుగా సమాచారం అందుతోంది. గత నెలలో హైదరాబాద్‌లోని మంత్రి మల్లారెడ్డి ఇళ్లతో పాటు ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో రెండు రోజుల పాటు ఐటీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం సీజ్ చేసింది. విచారణకు రావాల్సిందిగా మల్లారెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులుకు నోటీసులు జారీ చేసింది. తాజాగా ఆదాయపు పన్నుశాఖ అధికారులు కూడా తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించడం ఆసక్తి రేపుతోంది. కొన్ని రోజులుగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీబీఐ, ఈడీ అధికారులు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో హైదరాబాద్?తో పాటు పలు జిల్లాల్లో మరోసారి ఐటీ శాఖ దాడులు నిర్వహిస్తోంది. ప్రముఖ వ్యాపారవేత్తల ఇళ్లలో తనిఖీలు చేస్తోంది. జూబ్లీహిల్స్ లోని వంశీరామ్ బిల్డర్ సుబ్బారెడ్డితో పాటు ఆయన బావమరిది కాంట్రాక్టర్ జనార్ధన్ రెడ్డి ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 15 చోట్ల ఐటీ అధికారుల తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.మంత్రి మల్లారెడ్డి ఇళ్లతో పాటు ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో రెండు రోజుల పాటు ఐటీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం సీజ్ చేసింది. విచారణకు రావాల్సిందిగా మల్లారెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు పంపింది. అంతకు ముందు మంత్రి గంగుల కమలాకర్, టీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ గాయత్రి రవి ఇళ్లలో కూడా ఐటీ, ఈడీ సోదాలు జరిగాయి. విజయవాడలో వైసిపి నేత దేవినేని అవినాష్ ఇంట్లో ఐటి అధికారులు సోదాలు చేపట్టారు. మంగళవారం ఉదయం 6 గంటల 30 నిముషాల నుండి గుణదలలోని దేవినేని అవినాష్ నివాసంలో ఐటి అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఓ భూమి వ్యవహారానికి సంబంధించి ఐటీ అధికారులు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరోవైపు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని స్థిరాస్తి వ్యాపారి ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు కొనసాగుతున్నాయి. వంశీరామ్ బిల్డర్స్ యజమాని ఇల్లు, కార్యాలయంలో తనిఖీలు చేశారు. హైదరాబాద్, విజయవాడతో పాటు నెల్లూరులోనూ ఆ సంస్థకు చెందిన సీఈవో, డైరెక్టర్లు, పెట్టుబడిదారుల కార్యాలయాలు, ఇళ్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల్లో 20కిపైగా బృందాలు పాల్గొంటున్నాయి.

## ఎగ్జిట్ పోల్స్ లెక్క తప్పడం ఖాయం

### గుజరాత్‌లో వంద సీట్లు గెలవబోతున్నాం: కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (సమ సమాజం):** గుజరాత్ ఎన్నికల విషయంలో ఎగ్జిట్ పోల్స్ లెక్క తప్పుతుందని ఆప్ అధినేత, ఢిల్లీ సిఎం కేజ్రివాల్ వ్యాఖ్యానించారు. అక్కడ తాము దాదాపు 100 స్థానాలు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎనిమిది స్థానాలకు పరిమితం అవుతుందని ఎగ్జిట్ పోల్స్ స్పష్టంచేశాయి. దీనిపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రివాల్ స్పందించారు. మొత్తం 182 నియోజకవర్గాలున్న గుజరాత్ అసెంబ్లీలో మెజారిటీ స్థానాలను బీజేపీ గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు 38 స్థానాలు గెలిచే అవకాశం ఉన్నదని, ఆప్ మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని, ఆ పార్టీ కేవలం 8 స్థానాల్లో మాత్రమే గెలిచే చాన్స్ ఉందని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు వెల్లడించాయి.



# పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలి

(మొదట పేజీ తరువాయి) **హైదరాబాద్, డిసెంబర్ 6 (సమ సమాజం):** నూతన పార్లమెంట్ భవనానికి బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని చర్చ చేయాల్సిందిగా తెలంగాణ ఎంపీలను ప్రజాగాయకుడు గద్దర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ కేసీఆర్ తన ఎజెండాలో చేర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆఫీసర్లు, ఉద్యోగులు ఈ డిమాండ్‌కు మద్దతు తెలపాలని కోరారు. నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టలనేది సాంస్కృతిక ఉద్యమమని.. దీన్ని ఎవరూ ఆపలేరని గద్దర్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే అంబేద్కర్ రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఇందిరా శోభన్ అన్నారు. ఎనిమిది సంవత్సరాల్లో ఒక్కనాడు కూడా అంబేద్కర్ జయంతికి, వర్ధంతికి కేసీఆర్ నివాళులు అర్పించలేదని ఆరోపించారు. కేసీఆర్ కి టైం దగ్గర పడిందన్న ఆమె.. వాస్తు కారణంగానే సెక్రటేరియట్ ను కూల్చి కొత్తది కట్టారని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరికి కూడా అంబేద్కర్ జయంతి, వర్ధంతి గుర్తుండవా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన ఉందా? అన్న ఇందిరా శోభన్... అంబేద్కర్ ఇచ్చిన తెలంగాణని ఆమ్ ఆద్మీ పార్టీ కాపాడుకుంటుందని చెప్పారు. కేటీఆర్ కి అంబేద్కర్ కి నివాళులు అర్పించే సమయం ఉండదు కానీ, ప్రయివేట్ హోటల్స్ ఓపెన్ చేయడానికి మాత్రం సమయం ఉంటుందా అని నిలదీశారు.

## కవితకు ఇంటివద్దనే విచారణలో ఆంతర్యం

(మొదట పేజీ తరువాయి) ఆదేశించడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ తప్పుబట్టారు. కేసీఆర్ కుటుంబానికి నరేంద్ర మోడీ, అమిత్ షా బంధువా అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఈడీ కార్యాలయంలో అధికారులు విచారణ చేయలేదా? మరి కేంద్ర ప్రభుత్వం కవితకు ఎందుకంత ప్రత్యేకత ఇస్తుందని నిలదీశారు. బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనన్నారు. టీఆర్ఎస్ నేతలు ఇసుక,ల్యాండ్, మైనింగ్ మాఫియాలకు పాల్పడుతూ అడ్డగోలుగా అక్రమ ఆస్తులు సంపాదించుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ ఆరోపించారు.అవినీతి అసమర్థ పాలనపై, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నించకుండా వారి దృష్టిని మరల్చడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం దొంగ నాటకాలు ఆడుతుందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సీఎం కేసీఆర్ బుధవారం జగిత్యాల జిల్లాకు రానున్న నేపథ్యంలో వేములవాడ రాజన్నకు రూ.100 కోట్లు ఇస్తానన్న హామీ ఏమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ రీ ఓపెన్ చేస్తామని ఎమ్మెల్సీ కవిత ఇచ్చిన హామీపై సీఎం స్పందించాలన్నారు. 2018 ఎన్నికలకు ముందు కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు దాన్ని పట్టించుకోలేదన్నారు. దీని గురించి ప్రభుత్వానికి గుర్తు చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత ఏడాది నుండి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు గురించి విద్యార్థులు, యువకులు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ దానిపై స్పందించడం లేదని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వదిలేసి పంజాబ్, హర్యానా లాంటి ఇతర రాష్ట్రాల్లో మరణించిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు.

## కవిత కోరుకున్నట్లుగానే విచారణకు రెడీ

(మొదట పేజీ తరువాయి) అనువైన రోజున తనతో సమావేశం కావచ్చని సీబీఐకి కవిత లేఖ రాసింది. ఈ నేపథ్యంలో లిక్కర్ స్కాం కేసులో విచారణ కోసం టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఈ నెల 11న సమావేశం కావడానికి సీబీఐ అంగీకరించింది. లిక్కర్ స్కామ్‌లో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మరికొందరిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తన పేరు ఎక్కడా లేదని, మంగళవారం విచారణకు రావడం వీలుకాదని సీబీఐకి కవిత లేఖ రాశారు. సోమవారం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌తో ఆమె భేటీ తర్వాత ఢిల్లీ సీబీఐ డీఐజీ రాఘవేంద్ర వస్తాకు లెటర్ పంపారు. ఈ కేసులో కంప్లైంట్ కాపీ, ఎఫ్ఐఆర్ ఇవ్వాలన్న తన విజ్ఞప్తికి సీబీఐ నుంచి ఈ-మెయిల్ అందిందని కవిత తెలిపారు. సీబీఐ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఎఫ్ఐఆర్ కాపీని క్షుణ్ణంగా పరిశీలించానని, అందులో పేర్కొన్న నిందితుల జాబితాలో తన పేరు ఎక్కడా లేదని అన్నారు. తనకు సీఆర్పీసీ 160 కింద సీబీఐ పంపిన నోటీసులకు ఈ నెల 6న (మంగళవారం) తన నివాసంలో అందుబాటులో ఉంటానని ముందు వెల్లడించానని, అయితే.. ముందే ఖరారైన కార్యక్రమాల వల్ల 6న తాను సీబీఐ అధికారులను కలువలేకపోతున్నానని తెలిపారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తినని, సీబీఐ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 11, 12, 14, 15 తేదీల్లో ఏదో ఒక రోజు హైదరాబాద్‌లోని తన నివాసంలో వివరణ ఇచ్చేందుకు అందుబాటులో ఉంటానని సీబీఐకి లేఖలో తెలియజేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరును ఈడీ పేర్కొన్న తర్వాత 3 నుంచి వరుసగా సోమవారం వరకు మూడు రోజులు ప్రగతి భవన్‌లో కవిత సీఎం కేసీఆర్‌తో సమావేశయ్యారు. వీరి భేటీలో న్యాయనిపుణులు పాల్గొన్నారు. లీగల్ ఎక్స్‌పర్ట్‌లు, కేసీఆర్ సూచనతోనే మంగళవారం కాకుండా మరో తేదీన విచారణకు రావాలని సీబీఐకి లేఖ రాశారు.

## నేటినుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



(మొదట పేజీ తరువాయి) చర్చిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంటు సమావేశాలకు సహకరించాల్సిందిగా అన్ని పార్టీలను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ సమావేశంలో టీఆర్ఎస్ తరపున పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు, జేడీఎస్ నుంచి ఎంపీ దేవెగౌడ హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మార్గాని భరత్, తెలుగుదేశం పార్టీ తరపున గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్ హాజరయ్యారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, మరో కేంద్రమంత్రి పియూష్ గోయల్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి హాజరు కావాల్సి ఉండగా ఎందుకనో రాలేక పోయారు. ఇదిలా ఉండగా.. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్ మంగళవారం సాయంత్రం బిజినెస్ అడ్వైజరీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల రాజ్యసభ ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో జరిగే బిజినెస్ అడ్వైజరీ మీటింగ్‌లో అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొననున్నారు. శీతాకాల సమావేశాల్లో భాగంగా ఉభయ సభల్లో చర్చించాల్సిన అంశాలు, కీలక బిల్లులకు సమయం కేటాయింపు వంటి కీలక అంశాలపై బిజినెస్ అడ్వైజరీ మీటింగ్‌లో నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారం ప్రారంభమై డిసెంబర్ 29 వరకు కొనసాగ నున్నాయి. 23 రోజుల సెషన్‌లో 17 రోజులు సభ సమావేశం కానుంది. శీతాకాల సమావేశాలు పార్లమెంటు పాత భవనంలో జరగనున్నాయి. ఇది 17వ లోక్‌సభకు 10వ సెషన్ కాగా, రాజ్యసభకు ఇది 258వ సెషన్.ఈ సమావేశాల్లో అత్యధికంగా శాసనసభ పనులు జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీంతో పాటు ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అనేక అంశాలపై అర్థవంతమైన చర్చకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వం ప్రతిపక్షాల సహకారం కోరుకుంటున్నదని, ఈ సమావేశాల నిర్వహణలో ప్రతిపక్షాలు కూడా సానుకూల పాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.




# చలన చిత్రం



















# డిసెంబర్‌లో పలుచిత్రాల విడుదల

## ఆసక్తిగా చూస్తున్న అభిమానులు

ఈ సంవత్సరం చివరి దశకు వచ్చేసింది. కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టబోతున్నాం. ఈ ఏడాదిలో ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలు చూశాం. అలాగే ఎన్నో ఫేయిల్యూర్స్‌ను చూశాం. హిట్లు, ఫ్లాప్‌లు పక్కన పెడితే ప్రతీవారం ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి పలు సినిమాలు ముస్తాబవుతూనే ఉంటాయి. అన్ సీజన్‌గా పిలవబడే నవంబర్ నెల ఈ సారి టాలీవుడ్‌కు బాగానే కలిసి వచ్చింది. యశోద, మసూద, లవ్ టుడే వంటి సినిమాలు బాక్సాఫీస్ దగ్గర కమర్షియల్ విజయాలు సాధించాయి. అదే జోష్‌తో హిట్-2తో డిసెంబర్ నెల స్టార్ట్ అయింది. గత వారం విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతుంది. ప్రతీ వారం లాగానే ఈ వారం కూడా ప్రేక్షకులను అలరించడానికి పలు సినిమాలు రెడీ అవుతున్నాయి. ఈ వారం ఏకంగా 17సినిమాలు రిలీజ్‌కు పోటీ పడుతున్నాయి. సత్యదేవ్, తమన్నా జంటగా నటించిన ఈ చిత్రం డిసెంబర్ 9న రిలీజ్ కానుంది. నాగశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం కన్నడలో బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన లవ్ మాక్‌టైల్‌కు రీమేక్‌గా తెరకెక్కింది. ఇప్పటికే చిత్ర బృందం రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. బ్రహ్మానందం , శివాత్మిక రాజశేఖర్, స్వాతి రెడ్డి, సముద్రఖని, రాహుల్ విజయ్ ప్రధానపాత్రల్లో నటిస్తున్న పంచతంత్ర సినిమా డిసెంబర్9న రిలీజ్ కానుంది. చిత్రబృందం రిలీజ్ చేసిన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై భారీ అంచనాలే నెలకొల్పాయి. విశ్వక్ సేన్ కీలకపాత్రలో నటిస్తున్న ముఖచిత్రం సినిమా డిసెంబర్ 9న విడుదల కానుంది. గంగాధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కలర్ ఫోటో దర్శకుడు సందీప్ రాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించాడు. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ లాయర్‌గా కనిపించనున్నాడు. త్రిగుణ్, మేఘా ఆకాశ్ జంటగా నటించిన ప్రేమదేశం చిత్రం ఈ శుక్రవారం రిలీజ్ కానుంది. డియర్ మేఘ తర్వాత వీరిద్దరూ కలిసి నటించిన సినిమా కావడంతో ప్రేక్షకులలో భారీ అంచనాలే క్రియేట్ అయ్యాయి. పైగా చిత్రబృందం రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు సినిమాపై మంచి బజ్ తీసుకొచ్చాయి. మధ్య ఎక్కడ చూసిన కన్నడ సినిమాల హవానే కనిపిస్తుంది. సౌత్, నార్త్ అని తేడా లేకుండా ప్రతీ చోట కన్నడ సినిమాలకు విశేష అధరణ లభిస్తుంది. ఈ క్రమంలోనే మరో కన్నడ సినిమా ఈ వారం ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. నిహాల్ రాజ్‌పుత్, భారత్ బోపన్నా, అనంత్ నాగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 9న రిలీజ్ కానుంది. డేరింగ్ డాషింగ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. అప్సర రాణి, నైనా గంగూళి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ఇండియాలో తొలి లెస్బియన్ సినిమాగా తెరకెక్కింది. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు యూత్‌లో మంచి బజ్ క్రియేట్ చేశాయి.

# 9న ఓటిటిలోకి యశోద చిత్రం

టాలీవుడ్ టాప్ హీరోయిన్ సమంత నటించిన తాజా చిత్రం 'యశోద'. అద్దె గర్భం అనే విభిన్న కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం.. నవంబర్ 11న తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. హరి-హరీష్ దర్శకత్వం వహించిన ఈ మూవీ దాదాపు రూ.30 కోట్లకు పైగా కలెక్షన్లని రాబట్టి సత్తా చాటింది. ముఖ్యంగా ఈ సినిమాలో సమంత నటనకు అభిమానులతో పాటు విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు దక్కాయి. అయితే.. థియేటర్స్‌లో ఈ సినిమాని చూడలేకపోయిన ఎంతోమంది సినీ లవర్స్ ఈ చిత్ర ఓటీటీ విడుదల గురించి ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. నిజానికి ఈ చిత్రం ఇప్పటికే ఓటీటీలోకి రావాల్సింది. కానీ 'ఈవా' హాస్పిటల్స్ కేసు వేయడంతో విడుదలని నిలిపి వేశారు. తాజాగా దీనికి సంబంధించిన వివాదం సద్దు మణిగింది. దీంతో ఈ చిత్ర ఓటీటీ స్ట్రీమింగ్ ఉన్న అడ్డు తొలగింది. దాంతో ఈ నెల 9న ఈ మూవీ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే ఆ ఓటీటీ యాజమాన్యం నుంచి అధికారిక ప్రకటన రానుంది. కాగా.. మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూనే ఈ చిత్రానికి సమంత డబ్బింగ్ కంప్లీట్ చేయడం విశేషం.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in